# విశాలాంధ్ర గోదావరి జిల్లా
## ఏలూరు, పశ్చిమగోదావరి

## పారేసిన కూరగాయలు పెడుతున్నారా?

**ప్రభుత్వ వసతి గృహ అధికారుల తీరుపై**

**దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అసంతృప్తి**

**విశాలాంధ్ర-పెదవేగి:** ప్రభుత్వ వసతి గృహంలో ఉన్న విద్యార్థులను మన బిడ్డలతో సమానంగా చూడాలని దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ పేర్కొన్నారు.

మండలంలోని పెదవేగిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలను శనివారం దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలకు విచ్చేసిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కు స్థానిక నాయకులు, గురుకుల పాఠశాల సిబ్బంది మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ గురుకుల పాఠశాల ఆవరణలోని పరిసరాలను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో పారిశుధ్య నిర్వహణ సరిగా లేకపోవడం, తలుపులు లేని అధ్వాన్న స్థితిలో ఉన్న విద్యార్థుల స్నానాల గదులను చూసి చింతమనేని ప్రభాకర్ పాఠశాల

నిర్వాహకులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాలలోని వంట గదిని పరిశీలించిన చింతమనేని ప్రభాకర్ నాణ్యతలేని కూరగాయలను, సరుకులను గుర్తించారు. మార్కెట్లో తినడానికి పనికిరావంటూ పడేసే కూరగాయలను తీసుకువచ్చి కాంట్రాక్టర్లు గురుకుల పాఠశాలలో విద్యార్థులకు పంపిస్తుంటే వాటిని వండి పెట్టడం ఎంతవరకు సమంజసం అని అధికారులను, సిబ్బందిని చింతమనేని ప్రశ్నించారు. ప్రభుత్వ వసతిగృహాల్లోని విద్యార్థు లను తమ కుటుంబంలోని పిల్లలుగా భావించి వారికి అన్ని విధాల తోడ్పాటు అందించినప్పుడే అధికారులు తమ విధులకు న్యాయం చేసినట్లు అవుతుందని చింతమనేని ప్రభాకర్ సూచించారు. అనంతరం 10వతరగతి విద్యార్థులతో ఆయన ముఖా ముఖి నిర్వహించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఈఐడీసీ డీఈ కోటేశ్వరరావు, డి సి ఓ ఎన్ భారతి, ప్రిన్సిపాల్ ఎం. వెంకటేశ్వరరావు, టిడిపి మండల ప్రెసిడెంట్ బొప్పన సుధాకర్, గ్రామ సర్పంచి మేక కనకరాజు, నాయకులు తాత సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థిక ప్రగతికి తోడ్పడాలి : కలెక్టర్

**విశాలాంధ్ర-నరసాపురం:** మహిళలు స్వయం శక్తితో ఎదిగి, దేశ ఆర్థిక ప్రగతికి తోడ్పడాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. నరసాపురం పట్టణంలో

మొగల్తూరు రోడ్ లో ఉన్న మహిళా మార్ట్ ను శనివారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, స్థానిక శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ తో కలిసి పరిశీలించారు. మహిళా మార్ట్ ను నిర్వహిస్తున్న మహిళలతో ఆమె మాట్లాడారు రోజుకు ఎంత వ్యాపారం జరుగుచున్నది అడిగి తెలుసుకున్నారు. గతంలో స్టేట్ లెవెల్ స్కాచ్ అవార్డు సైతం అందుకున్నట్లు డ్వాక్రా మహిళలు కలెక్టర్ కు తెలిపారు. అనంతరం మహిళా సమాఖ్య పై అంతస్తులు వి ఓ ఏ లు తో జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, పాల్గొన్నారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 1994, 95 సంవత్సరంలో డ్వాక్రా గ్రూపులు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకుని వెళ్లి డ్వాక్రా గ్రూపులను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. డ్వాక్రా గ్రూపులు అంటే డబ్బులు సేవింగ్ చేసుకోవడమే కాకుండా వారికి సమాజంలో గ్రామంలో వారి ఇంటిలో సాంఘిక సమస్యలతో కూడా పోరాడి మాట్లాడే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డ్వాక్రా మహిళలకు ధైర్యం కల్పించడం జరిగిందన్నారు. ఈ మహిళా గ్రూపులు దేశవ్యాప్తంగా కాకుండా ప్రపంచవ్యాప్తంగా మంచి గుర్తింపు వచ్చిందని మన రాష్ట్రంలో గ్రూపులకు చాలా చరిత్ర ఉందని ఆమె అన్నారు. మన రాష్ట్రం డ్వాక్రా మహిళలను ప్రపంచమంతా ప్రత్యేక దృష్టితో చూసిన సందర్భాలు ఉన్నాయి అన్నారు.ప్రతి మహిళకు విన్నవించేది సమాజంలో జరుగుచున్న సమస్యలపై మాట్లాడాలని, మైనర్లకు వివాహాలు చేసే సందర్భాలు లో పోరాడాలని ఆమె అన్నారు. సొసైటీ మన ఊరు మన సమస్యలపై అవగాహన కలిగి అభివృద్ధి పై ఆలోచించే విధంగా ఉండాలని ఆమె అన్నారు. మహిళా మార్ట్ సేల్స్ మరింత పెంచాలని ఆమె అన్నారు. ఎకనామిక్ గా ఆర్థికంగా ఎదగాలంటే అంతా తెలుసుకుని అవకాశాలను అంది పుచ్చుకుని ముందుకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు.ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ మహిళలు అభివృద్ధికి ఎప్పుడూ ఎమ్మెల్యేగా మీ అందరికీ అందుబాటులో ఉండి సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగటానికి ప్రభుత్వ పరంగా రుణ ములు అందించడానికి తన పూర్తి సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయ న్నారు.ఈ కార్యక్రమంలో పిడి డిఆర్డిఏ ఎం ఎస్ ఎస్ వేణుగోపాల్, ఏపీఎంలు పి.పద్మ సిసిలు మండల సమాఖ్య అధ్యక్షులు, వి ఓ ఏ లు తదితరులు పాల్గొన్నారు.

## అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

**విశాలాంధ్ర-నరసాపురం:** మహిళలు అవకాశాలను అందిపుచ్చుకొని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ చదలవాడ నాగరాణి అన్నారు.శనివారం నరసాపురం పట్టణం మొగల్తూరు రోడ్డులో ఎస్ హెచ్ జిల ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న



బిఎంసియును జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, స్థానిక శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ తో కలసి పరిశీలించారు. రోజుకు ఎన్ని లీటర్లు పాలు వస్తున్నాయి, రైతులకు లీటరుకు ఎంత ధర ఇస్తున్నారు అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.అధికారులు, మిల్క్ సెక్రటరీలు, బి ఎం సి యు ల నిర్వాహకులు కలిసికట్టుగా పనిచేసి వ్యాపారం మరింత అభివృద్ధి చెందేలా కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, ఆర్డీవో అచ్యుత అంబారీష్, పొత్తూరి రామరాజు, పి డి ఆర్ డి ఏ ఎం ఎస్ ఎస్ వేణుగోపాల్, మిల్క్ సెక్రటరీలు, బి ఎం సీ యు ల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

**విశాలాంధ్ర-వీరవాసరం:** విద్యుత్ షాక్తో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని అండ లూరులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం

గ్రామా నికి చెందిన ప్రైవేట్ ఎలక్ట్రిషియన్ షేక్ సయ్యద్ బాజీ (44) శనివారం తమ్మినీడివారిపాలెం పొలాల్లో గన్నమనేడి లక్ష్మణ్ రొయ్యల చెరువు వద్ద కెపాసిటర్ చేంజింగ్ వర్క్ చేస్తుండగా ప్రమాదవశాత్తు ఎలక్ట్రికల్ షాక్ తగిలి మరణించాడు. ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించిన పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# ప్రభుత్వాసుపత్రుల పటిష్టతకు కృషి

**కలెక్టరు చదలవాడ నాగరాణి**

**విశాలాంధ్ర-పాలకొల్లు:** జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రిని శనివారం ఆకస్మికంగా సందర్శించి పాత ఆసుపత్రిని, నిర్మాణంలో ఉన్న 100 పడకల కొత్త ఆసుపత్రిని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలోని ఆసుపత్రులను పటిష్ట పరచడంతో పాటు, మెరుగైన వైద్యం అందించే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. పాలకొల్లు ప్రస్తుత ఆసుపత్రిలో శ్లాబ్ పెచ్చులు ఊడడం, వర్షపు నీరు లోనికి వచ్చి నిల్వ ఉండటం గమనించినట్లు తెలిపారు. వర్షపు నీరు లోనికి రాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారు లకు ఆదేశాలు ఇచ్చామన్నారు. ప్రస్తుతం వైద్య సేవలు అందించేందుకు ఇబ్బంది ఏమి లేదని స్పష్టం చేశారు. వంద పడకల హాస్పిటల్ 80 శాతం పూర్తయిందని, కింద గదులలో, స్లాబ్ పైన వర్షపు నీరు నిల్వ ఉండడం గమనించామన్నారు. పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించి, నెల రోజుల్లో వంద పడకల హాస్పటల్ను అప్ప చెప్పాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. పాలకొల్లు పట్టణానికి అన్ని హంగులతో, పూర్తి

సదుపాయాలతో ఆస్పత్రి ప్రారంభోత్సవం చేసి, ప్రజలకు వాడుకలోకి తెస్తామ న్నారు. హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి కేసులు ఏ సమయంలో వచ్చినా వెనువెంటనే చేర్చుకుని అవసరమైన వైద్య సేవలు, చికిత్సలు అందించాలన్నారు. జిల్లా కలెక్టరు వెంట ఏపి మెడికల్ కార్పొరేషన్ ఇంజనీర్ల బృందం యస్.ఇ కె.బలరామి రెడ్డి, ఈఈ బి.వి.గిరి, డిఈ యం.శ్రీనివాస రెడ్డి,హాస్పిటల్ సూపరింటెండెంటు డాక్టరు రవి కుమార్, డాక్టరు కె.వై.యస్.వర్మ, డాక్టరు సంతోష్ కుమార్, డాక్టరు అనిత, డాక్టరు సౌజన్య, నర్సింగు సూపరిం టెండెంటు విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

## ఏజెన్సీ ప్రాంతాల్లో కుండపోత వర్షం

**విశాలాంధ్ర-పోలవరం:** పోలవరం ఏజెన్సీ గిరిజన ప్రాంతాల్లో శనివారం తెల్లవారుజాము నుండి భారీ నుండి అతి భారీ వర్షం కురుస్తున్నది. ఈ కుండపోత వర్షానికి ఏజెన్సీ ప్రాంతాల నుండి గిరిజనులు మండల కేంద్రం పోలవరం రాలేని పరిస్థితి ఏర్పడింది. దీనికి తగ్గట్టు కొండ వాగులు, ఇసుక కాలువలు పొంగి పొర్లుతున్నాయి. పోలవరం మండలం వింజరం పంచాయతీ మెత్తపుకోట, ఉడతపల్లి గ్రామాల గిరిజనులకు వర్షాకాలం రాకపోకలు ఉండవు. దీనికి తగ్గట్టు వారు వారానికి ఒక్కరోజు మండల కేంద్రం పోలవరం సుమారు 20 కిలోమీటర్లు వచ్చి వారికి కావలసిన నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసి తిరిగి తమ గ్రామాలకు వెళ్తారు. సుమారు ఈ రెండు గ్రామాల్లో 60 కుటుంబాల గిరిజనులు నివసిస్తూ ఉంటారు. ఈ కుటుంబాల వారికి వర్షాకాలం వస్తేనే భయం. ఇటువంటివారిని ఐటీడీఏ అధికారులు వర్షాకాలం ఆదుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## దస్తావేజు లేఖర్ల సమస్యల పరిష్కారానికి కృషి

**విశాలాంధ్ర-ఏలూరు:** రాష్ట్రంలో దస్తావేజుల లేఖర్లు తమ సమస్యలు నివేదించేందుకు త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో బాటు, రాష్ట్ర రెవిన్యూ స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ను కలవనున్నట్టు రాష్ట్ర దస్తావేజుల లేఖర్ల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు పెనుమాక వెంకటసుబ్బారావు, దాసరి సుధాకర్ తెలిపారు. ఏలూరులో శనివారం అశోక్ నగర్లో వీరమాచినేని వెంకట నారా యణ భవనంలో రాష్ట్ర స్థాయి దస్తావేజుల లేఖర్ల కార్యవర్గ సమావేశం సంఘ అధ్యక్షుడు పెనుమాక వెంకట సుబ్బారావు అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశానికి రాష్ట్ర నలుమూలలనుండి దస్తావేజు లేఖర్లు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా పలువురు సంఘ నాయకులు మాట్లాడుతూ దస్తావేజుల లేఖర్ల లైసెన్సులు 2.లో ఉన్న అంశాల మార్పులు చేర్పులు చేయడానికి వివిధ అంశాల పై సంఘ నాయలు కూడా చర్చించడానికి రాష్ట్ర సంఘానికి ప్రాతినిధ్యంతో కూడిన అధి కారం ఉండాలని కార్యవర్గ సమావేశం తీర్మానం చేసింది. ఈ కార్యక్రమంలో కోశాధికారి సత్యనారాయణ, సంఘ సభ్యులు వి వి ఎస్.సుబ్బారావు, బి. ప్రసాద్,రామకృష్ణ,నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

## అలుపెరుగని పోరాటం చేయాలి

**విశాలాంధ్ర -భీమవరం :** అపరిష్కృత డిమాండ్ల సాధన కోసం అలుపెరుగని పోరాటం చేయాలని పశ్చిమగోదావరి జిల్లా పంచాయతీ

కార్యదర్శుల సంఘం పిలుపునిచ్చింది. శని వారం భీమవరం మండ లం కొవ్వాడ అన్నవరం గ్రామ పంచాయతీలో పశ్చిమగోదావరి జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం (గ్రేడ్ 1 నుండి గ్రేడ్ 5 వరకు) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రమోషన్లు, పే స్కేలు అమలు విషయంలోను అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. అనంతరం జిల్లా గౌరవ అధ్యక్షునిగా డి.సత్యనారాయణ, జిల్లా అధ్యక్షులుగా పాల శ్రీనివాస్, జనరల్ సెక్రటరీగా దేవాబత్తుల నాగదేవి, ట్రెజరర్ గా సుంకర వెంకటేష్, ఉపాధ్యక్షులుగా జీవీఎల్ నరసింహారావు, కె.వి.రామారావు, వి.ఎన్ కళ్యాణి, సిహెచ్ చంటిబాబు, పి.వీర్రాజు, అసోసియేట్ ప్రెసిడెంట్లుగా ఆర్ వి బ్రహ్మం, బి.సతీష్ కుమార్, వై.మునిరాజు, జివిటి నాయుడు, జి.రాధా లక్ష్మి ప్రశాంతి, జాయింట్ సెక్రటరీగా ఎం.ప్రవీణ్ కుమార్, జి.శ్రీనివాస్, డి. ఎస్ ఆర్ ప్రసాద్, జి.సుబ్బారావు, వంగారాజు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

**విశాలాంధ్ర-ఆగిరిపల్లి:** పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఎస్.టి.యు.

ఆగిరిపల్లి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మక్కె వేణుగోపాలరావు, కొవ్వలి కోటమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిపిఎస్ (గ్యారంటీడ్ పెన్షన్ స్కీం) చట్టాన్ని రద్దుచేసి ఉద్యోగ ఉపాధ్యాయుల ఆకాంక్షను నెరవేరుస్తామని చెప్పిన ప్రస్తుత ప్రభుత్వం ఆ చట్టాన్ని అమలు చేయాలని చూడడం,ఆ చట్టం అపాయింటింగ్ తేదీని ఖరారు చేస్తూ జీవో నెంబర్ 54ను విడుదల చేయడం వలన 5 లక్షల ఉద్యోగ ఉపాధ్యాయులకు వారి కుటుంబ సభ్యులకు అన్యాయం జరుగుతుందన్నారు. ఎన్.డి.ఎ.కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ ప్రకారం జిపిఎస్ చట్టాన్ని రద్దుచేసి ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికులకు అందరికీ ఆమోదయోగ్యమైన పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

## ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడతా

**పౌర సన్మానంలో ఎమ్మెల్యే రోషన్కుమార్ హామీ**

**విశాలాంధ్ర-లింగపాలెం:** ధర్మాజీగూడెం ప్రజలు చూపించిన ఆదరాభిమానం మరువలేనని ఎమ్మెల్యే రోషన్ కుమార్ అన్నారు. ధర్మాజీగూడెంలో శనివారం

జరిగిన పౌర సన్మానంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు తనపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారని వాటన్నింటినీ నెరవేరుస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. గ్రామస్తుడిగా ప్రజలు చూపిన ఆదర అభిమానాలు నా బాధ్యతను మరింతగా పెంచా యని పేర్కొన్నారు. తనపై ఇంతటి అభిమానాన్ని పెంచుకున్న ప్రజలకు రుణపడి ఉంటానని అన్నారు. స్వగ్రామమైన ధర్మాజీ గూడెం అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతానని హామీ ఇచ్చారు. పౌర సన్మానానికి విచ్చేసిన ఎమ్మెల్యే దంపతులకు స్థానిక ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. అభినందన కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే దంపతులను వారి పిల్లలను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో చింతలపూడి నియోజకవర్గ నాయకులు పెదబాబు,చలపతి, రాము తదితరులు పాల్గొన్నారు. పార్టీలకతీతంగా గ్రామానికి చెందిన అన్ని కులాలవారు ఈ సభలో పాల్గొని ఎమ్మెల్యే దంపతులను సన్మానించారు. పరసా ప్రభుదాసు, దువ్వూరు బాబురావు,సొంగా నాగేశ్వరరావు తదితరుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## మీ సొంత ఇంటి నిర్మాణాలు ఇలానే చేస్తారా?

**- గత ప్రభుత్వ మైకంలోనే ఇంకా ఉన్నారా....**

**- అధికారులపై మంత్రి నిమ్మల ఆగ్రహం**

**విశాలాంధ్ర - పాలకొల్లు:** పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నిర్మిస్తున్న వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిని రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు శనివారం అకస్మికంగా తనిఖీ చేశారు. టిడిపి ప్రభుత్వ

హయాంలో మంజూరైన రూ.12.60 కోట్లతో, గత ప్రభుత్వంలో చేపట్టిన కొత్త వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణ పనులలో నాణ్యత కొరవడడం గమనించిన మంత్రి సంబంధిత ఇంజనీరింగ్ అధికారులపై తీవ్ర అసహనాన్ని, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. సంవత్సరంలో పూర్తి చేయాల్సిన ఆసుపత్రి నిర్మాణం ఎందుకు పూర్తి కాలేదో చెప్పాలన్నారు.

భవన స్లాబ్ నుండి వర్షపు నీరు లీకేజ్ అవడం, పలుచోట్ల వర్షం నీరు నిల్వ ఉండిపోవడం గమనించిన మంత్రి నిమ్మల రామానాయుడు మీ సొంత ఇంటి నిర్మాణాలు ఇదేవిధంగా చేస్తారా..? ఇంకా గత ప్రభుత్వ మైకంలోనే ఉన్నారా అని ప్రశ్నించారు. ప్రస్తుతం ప్రభుత్వం మారిందని పనులన్నీ నాణ్యతతో సవ్యంగా జరగాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షణ చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో బాలింతలను పలకరించారు. స్వయంగా శిశువులను ఎత్తుకుని ఆప్యాయంగా ముద్దాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణపు పనుల పరిస్థితి పై జిల్లా కలెక్టర్,ఆరోగ్య, వైద్యశాఖ కమిషనర్ లతో ఫోన్లో మాట్లాడారు. ఇదే సమస్య మరోసారి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. బోణం చినబాబు, కర్నేన గౌరు నాయుడు, పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, ధనాని సూర్యప్రకాష్, జక్కంపూడి కుమార్, శిడగం సూరి, టిడిపి బిజెపి జనసేన ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన కూరగాయల సాగు

**విశాలాంధ్ర-వీరవాసరం:** ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిన నాణ్యమైన కూరగాయలు, ఆకుకూరలు తినడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని ప్రాజెక్ట్ మండల ఇన్చార్జి పి.దేవీ నాగరాజు అన్నారు. మండలంలోని అండలూరులో సూర్య మండలంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్య మండలంలో ఏడాది పొడవునా కూర గాయలు, ఆకు కూరలు లభ్యత అవుతాయని, ఎటువంటి రసాయన ఎరువులు వాడకుండా జీవా మృతం, ఘన జీవామృతం, కషాయాల వాడకం ద్వారా ఇవి పండించడం జరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ప్రతి ఒక్కరూ కూరగాయలు పండించి తినాలని, ఇంటి పైన ఖాళీ స్థలాల్లో, టెర్రస్ గార్డెన్స్, కిచెన్ గార్డెన్స్ ప్రతి ఒక్కరూ పెట్టుకోవాలని సూచించారు. కార్య క్రమంలో ఐసిఆర్పిలు నవీన్

కుమార్, సర్వేశ్వరరావు, నాగరాజు, శ్రీనివాస్, మురళి కుమార్, సతీష్ కుమార్, రైతులు, ఎస్.హెచ్.జి మహిళలు తదితరులు పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

I, **NAZIYA BEGUM (NEW NAME), C/o SHAIK BAKSHALLI,** Previously called **NAZIA BEGUM (OLD NAME)**, Resident of D.No.5-2-22, Opp. Meena Biscuit Company, Mente vari Thota, Bhimavaram, Bhimavaram Mandal, W.G.Dist, Andhra Pradesh, Pin : 534 201, Now Changed my name from **NAZIA BEGUM (OLD NAME) to NAZIYA BEGUM (NEW NAME)** Today onwards Use my New Name for all further Transactions.

**CHANGE OF NAME**

I, **DAYAM SUJATHA (NEW NAME), W/o RAVI KUMAR,** Previously called **DAYAM SUJATA (OLD NAME),** Resident of D.No. 14-17-43/2, Yagarlapalli, Tadepalligudem Town, Tadepalligudem Mandal, West Godavari District, Andhra Pradesh, Pin : 534 102, Now Changed my name from **DAYAM SUJATA (OLD NAME) to DAYAM SUJATHA (NEW NAME)** Today onwards Use my New Name for all further Transactions.

**పాస్‌పోర్టు పోయినది**

యేల్లమేల్లి రవీంద్ర, తండ్రి : నూర్యారావు, డోర్ నెం. 25-6-151రు, 29వ వార్డు, బి.సి. కాలనీ, భీమవరం మున్సిపల్ ఏరియా, ప.గో.జిల్లా, ఆంధ్ర, అనువేను ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా నేను ఒరిజినల్ పాస్‌పోర్టు (నెం.T8544073 గలది) కలిగి ఉన్నాను. ది.01.07.2024 తేదీన సదరు పాస్‌పోర్టును ఒక కవరులో పెట్టుకుని జిరాక్స్ తీయించుకొను నిమిత్తం మా ఇంటి వద్దనుండి డి.ఎన్.ఆర్. కాలేజీ రోడ్డుకు వెళ్తుండగా మార్గమధ్యలో నా ఒరిజినల్ పాస్‌పోర్టు పెట్టిన కవరు జారిపడిపోయినది. ఎంతవెదికినను దొరకలేదు. కావున ఎవరికైనను దొరికిన యెడల పైన తెలిపిన చిరునామాకు అందజేయగలరు.

ఫోన్ : 96187 75488

## సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తున్న సంస్థలపై చర్యలు తీసుకోవాలి

**విశాలాంధ్ర-తణుకు:** సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తున్న విద్యా

సంస్థలపై చర్యలు తీసు కోవాలని ఏఐఎస్ఎఫ్ తణుకు నియోజకవర్గ అధ్య క్షులు గంటా పవన్ డిమాండ్ చేశారు.ఈ మేరకు శని వారం తణుకులో తరగతులు నిర్వహిస్తున్న పలు ప్రైవేటు విద్యాసంస్థలను ఏఐఎస్ఎఫ్ నాయకులు మూయించి వేశారు. ఈ సందర్భంగా గంటా పవన్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తూ పట్టణంలో పలు ప్రైవేట్ విద్యాసంస్థలు సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తున్నారని అటువంటి విద్యాసంస్థలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు .లేని పక్షంలో తరగతులు నిర్వహించే విద్యా సంస్థలను ఏఐఎస్ఎఫ్గా తామే మూయించి వేస్తామని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ సమితి నాయకులు బి.రాజు, ఎస్కే అమీర్, బి.ఆశ్రిత్, ఎండి నయీమ్, కె.ఓంకార్, ఎస్.కె మౌలా తదితరులు పాల్గొన్నారు.

## ఆస్పత్రి అభివృద్ధికి అన్ని విధాల సహకరిస్తా

**విశాలాంధ్ర-ఏలూరు:** ఏలూరులో ఉన్న ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని

మోడరన్ ఆసుపత్రిగా తీర్చిదిద్ద దానికి అవసరమైన నిధులను సమకూర్చ దానికి కృషి చేస్తానని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ చెప్పారు. ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిని శనివారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాల్లో రోగుల వద్దకు నేరుగా వెళ్లి వైద్య సేవలు ఏ విధంగా అందుతున్నాయో, వారిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో దోమలు రాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబం ధిత అధికారులు ఆదేశించారు. వర్షాకాలం దృష్ట్యా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రిలోని జనరల్ వార్డు నుంచి అన్ని విభాగాలు కూడా ఏసీలు ఉండాలని ఆదేశించారు. అందుకు అవసరమైన నిధులను సమకూరుస్తానని ఎంత బడ్జెట్ అవసరమో మూడు రోజుల్లోగా తగిన నివేదిక తనకు అందించాలని సూచించారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాల్లో ఏఏ వైద్య పరికరాలు అవసరమో వాటి వివరాలను తమ కార్యాలయానికి తెలియజేయాలని సూచించారు. ఏపీ ఎస్ఎంఐడిసి ఇంజనీరైన రాజబాబు నుంచి ఆసుపత్రి అభివృద్ధి పనులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో ప్రస్తుతం 330 పడకలు మాత్రమే అనుమతి ఉందని దీనిని మరింత పెంచడానికి కృషి చేస్తానన్నారు. ట్రామా కేర్ విభాగాన్ని పరిశీలిం చిన అనంతరం ఆ విభాగం స్టాఫ్ నర్సులు సిబ్బంది ఎంపీ పుట్టా మహేష్ కుమార్కు శాలువా కప్పి పుష్పగుచ్చం అందించి సత్కరించారు. ఎంపీ తోపాటు ఆసుపత్రి ఇన్చార్జి మెడికల్ సూపరింటెం డెంట్ డాక్టర్ పిఏ ఆర్ఎస్ శ్రీనివాస్, ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ ప్రసాదరెడ్డి, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మల్లికార్జునరావు, డాక్టర్ రవికుమార్ పలువురు పాల్గొన్నారు.

## ప్రసాద్ కవితకు అంతర్జాతీయ ప్రథమ బహుమతి

**విశాలాంధ్ర-తణుకు :** ఐఎస్ఓ గుర్తింపు పొందిన అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ అయిన

శ్రీ శ్రీ కళావేదిక " పర్యావరణాని కో మొక్క నాటుదాం" అనే అంశంపై అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన కవితల పోటీల్లో తణుకు పట్టణ కవి, పూర్వపు పశ్చిమగోదా వరి జిల్లా అరసం మాజీ అధ్యక్షులు వి ఎస్ వి ప్రసాద్ కు ప్రథమ బహుమతి లభించింది. ఈ పోటీల్లో సుమారు 350 మంది కవులు పాల్గొన్నారు. వృక్షాలే పర్యావరణ పరిరక్షణకు తను త్రాణాలు(కవచాలు )అంటూ," తనుత్రాణం" అనే శీర్షికతో కవి ప్రసాద్ రచించిన కవితకు విశేష స్పందనతో ఈ పురస్కారం లభించింది. గతంలో ఈ సంస్థ నుండి కవి ప్రసాదుకు మూడవ అత్యుత్తమ పురస్కారం రావడం పట్ల పట్టణ సాహితీవేత్తలు, ప్రముఖులు తదితరులు ప్రసాద్ ను అభినందించారు.

## అశోక్ నగర్ శ్మశాన వాటిక అభివృద్ధికి చర్యలు

**విశాలాంధ్ర-ఏలూరు:** స్థానిక అశోక్ నగర్ లోని శాంతివనం స్మశాన వాటిక

అభివృద్ధికి త్వరలో చర్యలు చేపడతామని ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) అన్నారు. శనివారం ఆయన అశోక్ నగర్లోని శాంతివనం స్మశాన వాటికను పరిశీలించారు. శాంతి వనం లోని రోడ్లు, విశ్రాంతిభవనం, దహన సంస్కారాలు జరిగే ప్రదేశాలను, స్నానఘట్టం, శాంతి రథాలు, ఫ్రీజర్లు ఉండే షెడ్డును పరిశీలించారు. అనంతరం స్మశాన వాటికలో ఆయన మొక్కలు నాటి, ట్రీ గార్డులను ఏర్పాటు చేశారు. నగర ప్రజలకు మేలు చేసే విధంగా స్మశాన వాటిక కోసం చిత్తశు ద్ధితో ,నిస్వార్ధంగా పనిచేస్తున్న ఫ్లాష్ టీం స్వచ్ఛంద సంస్థ సేవలను ఎమ్మెల్యే బడేటి చంటి అభినందించారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ చోడే. వెంకటరత్నం ,ఏఎంసీ మాజీ చైర్మన్ పూజారి నిరంజన్, ఆర్ఎన్ ఆర్ నాగేశ్వరరావు, వేగి ప్రసాదు, పేటేటి పాండురంగారావు, ఫ్లాష్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## 24 గంటల్లో సమస్యకు పరిష్కారం

**విశాలాంధ్ర - కామవరపుకోట :** ఇటీవల జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన వెట్రీ సెల్వి ప్రజా సమస్యల పరిష్కారం కోసం వాట్సాప్ నెంబర్ ఏర్పాటు చేసిన సంగతి విధితమే. ఏలూరు-జంగారెడ్డిగూడెం రోడ్డులో ఉప్పలపాడు వద్ద ఎండిపోయిన చెట్లు ప్రమాదకరంగా ఉన్నాయని వాట్సాప్ నెంబర్కు సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ వీరమల్ల మధు సందేశాన్ని పంపించారు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకున్న అధికార యంత్రాంగం 24 గంటల్లోనే ఎండిపోయి ఉన్న చెట్లను తొలగించారు. ఇదే విషయంపై గత రెండు సంవత్సరాలుగా అధికారులకు విన్నవించినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని, జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి వాట్సాప్ సందేశం ద్వారానే సమస్యను పరిష్కరించినందుకు మధు కృతజ్ఞతలు తెలియజేశారు. ఇదే రోడ్డులో రావికంపాడు, నారాయణపురం, తడికలపూడి సమీపంలో ఎండిపోయి ఉన్న చెట్లను కూడా తొలగించాలని మధు కోరారు.

## వర్షంతో రైతులకు ఊరట

**విశాలాంధ్ర-లింగపాలెం:** లింగపాలెం మండలంలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం వర్షం పడింది.వర్షం వల్ల రైతులు ఊరట చెందుతున్నారు. మండలంలో తగినంత వర్షాలు పడకపోవడంతో నిరాశతో ఉన్నారు.శుక్ర, శనివారాలలో వర్షం పడినప్పటికీ వరి నాట్లు వేసేందుకు ఉపయోగంగా లేదు. నారుమళ్ళకు మాత్రమే పడిన వర్షం ఉపయోగపడుతుందని రైతులు అంటున్నారు. దుక్కులు దున్ని వరి నాట్లు వేసేందుకు రైతన్నలు పొలాలను సిద్ధం చేశారు.పెద్ద వర్షం కోసం రైతుల ఆశతో ఎదురుచూస్తున్నారు. రెండు రోజుల పడిన వర్షం వల్ల వాతావరణం చల్లబడి ప్రజలు ఎండ తాపం నుంచి ఉపశమనం పొందారు.

## ట్రిపుల్ ఐటీకి తొమ్మిది మంది విద్యార్థుల ఎంపిక

**విశాలాంధ్ర-టి నరసాపురం:** అప్పల రాజు గురుకుల పాఠశాల విద్యార్థులు గత మార్చి నెలలో జరిగిన 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడంతో పాటు తొమ్మిది మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీ కి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డీఎస్ బి. శంకర రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తొమ్మిది మందిలో నూజివీడు ట్రిపుల్ ఐటీకి నలుగురు విద్యార్థులు, ఒంగోలు ట్రిపుల్ ఐటీకి నలుగురు విద్యార్థులు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ కి ఒక విద్యార్థి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఎంపికైన విద్యార్థులను మండల విద్యాశాఖాధికారులు టి. రామ్మూర్తి, ఎస్. కళ్యాణి, పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

## నిధులు ఇచ్చారు .. అడ్డు పుల్ల వేశారు

**విశాలాంధ్ర- ఉంగుటూరు :** దేవుడు వరమిచ్చిన... పూజారి కరుణించలేదు అనే సామెత లాగా ఉంగుటూరు పరిస్థితి ఉంది. ఉంగుటూరులో రెండు రోడ్డులకు అప్పటి వైసీపీ ఎమ్మెల్యే పుప్పాల శ్రీనివాస్( వాసు బాబు ) నిధులు ఇచ్చారు. ఆ పార్టీ స్థానిక వైసిపి ప్రజాప్రతి నిధులు కరుణించలేదు. దీంతో రెండు రోడ్లకు ఇచ్చిన సచివాలయం నిధులు వెనకకు వెళ్ళిపోయాయి. వైసిపి ప్రభుత్వం హయాంలో గ్రామాల్లో రోడ్లకు సచివాలయ నిధులు మంజూరు చేశారు. ఉంగుటూరు రైల్వే గేట్ అవతల పక్కనే ఉన్న రెండు రోడ్లు కు అప్పటి వైసిపి ప్రభుత్వం సచివాలయం నిధులు ఇచ్చారు. దీంతో వైసీపీ స్థానిక ప్రజాప్రతినిధులు ఆ పనులను టిడిపికి చెందిన కాంట్రాక్టర్లకు ఇచ్చారు. గత ఏడాది (2023) డిసెంబర్ నెలలో ఈ రోడ్డులకు భూమి పూజలు చేశారు.పనులు ఎలా జరుగు తున్నాయో పరిశీలించడం కోసం టిడిపికి చెందిన ఉంగుటూరు గ్రామ సర్పంచ్ బందారు సింధు మధుబాబు, గ్రామ ఉపసర్పంచ్ పాతూరి జనార్ధన్ పరిశీలించారు.ఆ వార్త పేపర్లో రావడంతో స్థానిక వైసిపి ప్రజా ప్రతినిధులు జీర్ణించుకోలేకపోయారు. అప్పుడు వైసిపి ప్రజా ప్రతినిధులు సొమ్ము ఒకడిది సోకొకడిది అంటూ ఒక సభలో టిడిపి ప్రజా ప్రతినిధులపై విమర్శల వర్షం కురిపించారు. టిడిపి ప్రజా ప్రతినిధులు మాత్రం మౌనంగా ఉండి పోయారు. ఉంగుటూరు గ్రామ సర్పంచి టిడిపి అయినా, వైసిపి ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులకు పంచాయతీ ద్వారా తీర్మానాలు చేసి ఇవ్వటం తప్ప ఎప్పుడూ అభ్యంతరం పెట్టలేదు. మా పై విమర్శలు చేయటం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని వారన్నారు. రైల్వే గేట్ అవతల రెండు రోడ్ల పనులకు అడ్డుపుల్ల వేశారు. దీంతో రోడ్డు పనులు నిలిచిపోయాయి. ఇప్పటికి సుమారు 8 నెలలు దాటుతుంది. సచివాలయం నిధులు వెనక్కి వెళ్ళిపోయాయి. రెండు రోడ్డు పనులు నిలిచి పోయాయి. ఆ రోడ్డు పరిస్థితి చూస్తే గోతులతో అధ్వానంగా ఉంది. ఆ రెండు వీధుల వారు మా రోడ్డు వేయండని అనేకసార్లు వైసిపి ప్రజాప్రతినిధి దగ్గరికి వెళ్లి కోరారు. కానీ స్థానిక వైసిపి ప్రజా ప్రతినిధులు ఇలా చేయటం వల్లనే రోడ్డు పనులు నిలిచిపోయాయని రెండు వీధుల వారు విమర్శిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం పోయింది, నిధులు వెనక్కి వెళ్ళిపోయాయి. కూటమి పార్టీ అధికారంలోకి రావడంతో మా రోడ్డు వెయ్యాలని వారు కోరుతున్నారు.

## అందరిలో సామాజిక సేవాభావం ఉండాలి

**విశాలాంధ్ర-దెందులూరు :** ప్రతి ఒక్కరిలోను సామాజిక సేవా భావం ఉండాలని దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ పేర్కొన్నారు. శనివారం పెదవేగి మండలం మొండూరు ప్రాథమిక పాఠశాలలో ఏలూరులోని ఆంధ్ర ఆస్పటల్ వారు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముండూరు గ్రామానికి చెందిన బలుసు లక్ష్మణ రమేష్, దివ్యశ్రీ దంపతుల కుమారుడు బలుసు దీపు శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరంలో జనరల్ వైద్యంతోపాటు యురాలజీ, కార్డియాలజీ, రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయం అని, కుమారుడి పుట్టిన రోజు సందర్భంగా ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించాలనే ఆలోచన ఆ దంపతులకు రావడం వారిలోని సామాజిక స్పృహకు నిదర్శనం అని అన్నారు. అనంతరం దంపతులు సహాయంతో ఎలిమెంటరీ స్కూల్, హైస్కూల్ విద్యార్థులకు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ చేతుల మీదుగా వాటర్ బాటిళ్లను కానుకగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు ఎం ఎల్ వి ప్రసాద్, శర్వాణి, స్వరూప్ రెడ్డి, హరికృష్ణ, మండల టిడిపి అధ్యక్షులు బొప్పన సుధాకర్, తాత సత్యనారాయణ, మాజీ సర్పంచ్ పర్వతనేని రాజరాజేశ్వరి, ఆళ్ల కార్తీక్, ఎంపీటీసీ ఉప్పులూరి రామరాజు సామ్రాజ్యం, అన్నపనేని సురేష్, నెక్కలపూడి సురేష్, తెలుగుదేశం పార్టీ నాయకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## హిందీ పద్య పఠన పోటీ విద్యార్థులకు బహుమతులు ప్రదానం

**విశాలాంధ్ర-ఏలూరు:** స్థానిక ఏలూరు పవర్ పేట లోని హిందీ నికేతన్ వజ్రోత్సవాలలో భాగంగా శనివారం హిందీ పద్య పఠన పోటీలు నిర్వహించినట్లు కార్యదర్శి పి.కవితా కుమారి తెలియజేశారు. హిందీ నికేతన్ అధ్యక్షులు వి. వెంకటస్వామి మాట్లాడుతూ నేడు పిల్లలకు పద్యం ప్రాముఖ్యత తెలియడం లేదని, పద్యం అవసరాన్ని, ప్రాముఖ్యతను తెలియజేయడానికి హిందీ పద్య పఠన పోటీలు నిర్వహించామని అన్నారు. పిల్లలకు నైతిక జీవన సూత్రాలు తెలపడానికి, ధారణ శక్తి వృద్ధికి, భాషా సౌందర్యం తెలుసుకోవడానికి,ఆత్మవిశ్వాసం కోల్పోతున్న అనేక సందర్భాలలో ఆత్మవిశ్వాస బీజాల్ని నాటి వాటిని మహావృక్షాలుగా పెంచేవి పద్యాలని, ప్రతి విద్యార్థి పద్య పఠనం నిరంతరం చేయాలని అన్నారు.ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతగా వ్యవహరించిన హిందీ పండిట్ ట్రైనింగ్ కళాశాల లెక్చరర్ పి యం మోహన్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులలో పద్య పఠనం వలన వ్యక్తిత్వ వికాసం, ఆత్మ చైతన్యం, సాహితీ విలువలతో కూడిన జీవితం అలవడుతుందన్నారు. కార్యదర్శి కవితా కుమారి మాట్లాడుతూ హిందీ నికేతన్ వజ్రోత్సవాల సందర్భంగా సంవత్సరమంతా విభిన్న కార్యక్రమాలు నిర్వహిస్తామని విద్యార్థులు జాతీయ భాష హిందీ పట్ల ఆసక్తి చూపించి భాషను అభ్యసించిన ఎడల భారతదేశంలోని ఏ ప్రాంతానికి వెళ్ళినా భాషా సమస్యలు ఉండవని,ఈ పోటీ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.ఈ పోటీల్లో మొత్తం 66 మంది విద్యార్థులు పాల్గొనగా ప్రథమ, ద్వితీయ తృతీయ బహుమతులను వరుసగా ఎస్ ప్రతిమ, ఎస్ నందకిషోర్, సిహెచ్ రేవంత్ పొందగా ఎస్. శ్రీసౌమ్య, ఆర్.ధనరాజ్ ప్రోత్సాహక బహుమతులు పొందారు. ఈ కార్యక్రమంలో హిందీ పండితులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## హామీల అమలుకు ప్రణాళికలు సిద్ధం

**విశాలాంధ్ర - కలిదిండి:** ఎన్డీఏ కూటమిలో ఇచ్చిన హామీలు అమలుపరచడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని టిడిపి రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి ఆంధ్రాజు శ్రీనివాస రావు తెలిపారు. శనివారం మండలంలోని మట్టగుంట గ్రామంలో పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు నెల రోజుల పాలన అద్భుతమని అన్నారు. ఎన్నికల హామీలో భాగంగా మొదటిగా నిరుద్యోగులకు మెగా డీఎస్సీ ,ల్యాండ్ టైటిల్ రద్దు, పింఛన్ పెంపు, అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ లాంటి పథకాలు అమలు చేసిన ఘనత ఎన్ డి ఏ కూటమి ప్రభుత్వానిదని తెలిపారు. గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన పోల వరం, అమరావతి, విద్యుత్ రంగాల పై శ్వేత పత్రాలు విడుదల చేసి వాస్తవాలను ప్రజలకు వివరించారని తెలిపారు. మిగిలిన హామీలను కూడా అమలు పరుస్తారన్నారు. దుర్మార్గ పరిపాలనను విముక్తి పొంది చంద్రబాబు నాయుడు పరిపాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు ఉద్యోగస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసి వైస్ చైర్మన్ నాగిడి, వీరబ్రహ్మం, నాయకులు అంధ్రాజు. దుర్గారావు,తిరుమణి. గోపాలకృష్ణ, పాండురంగారావు,తిరుమల శెట్టి. వెంకటేశ్వరరావు, ఒడుగు. గణపతి, పొన్నాల. కొండలరావు, తిరుమల శెట్టి. ఈశ్వర పరశురాముడు తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోనే అభివృద్ధి

**విశాలాంధ్ర నరసాపురం:** విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, పిల్లలను విద్యావంతులను చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శనివారం నరసాపురం మండలం వేములదీవి ఈస్ట్ గ్రామంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పర్యటించారు. వేముల దీవి తుఫాన్ రక్షిత భవనంలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ తొలుత జిల్లా కలెక్టర్‌కు బుద్ధుని విగ్రహాన్ని బహుకరించారు. అనంతరం తీర ప్రాంతంలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను శాసనసభ్యులు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి దృష్టికి తీసుకువచ్చారు. త్రాగునీరు రోడ్లు వారి జీవన శైలిలో పలు అంశాలను ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ తీర ప్రాంతాల్లో మత్స్యకారుల జీవనశైలి వారి నడవడిక పద్ధతులను తెలుసుకునేందుకు ముఖా ముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. మీ సమస్యలు జీవన శైలిలో ఎదుర్కొంటున్న అంశాలను వివరించాలని గ్రామ ప్రజలను కోరారు. పలువురు మత్స్యకార నాయకులు స్థానిక ప్రజలు తీర ప్రాంతంలో ఉంటున్న ప్రజలు అనుభవిస్తున్న జీవనశైలి వారు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్, ఆర్డీవో ఎం.అచ్యుత అంబారీష్, జిల్లా మత్స్య శాఖ అధికారి ఆర్ వి ఎస్ ప్రసాద్, నియోజకవర్గ టిడిపి అధ్యక్షులు పొత్తూరి రామరాజు,జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షులు అంధ్రజు చల్లారావు తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యుత్ నిరంతరాయంగా సరఫరా చేయాలి

**విశాలాంధ్ర-ఏలూరు:** జిల్లాలో నాణ్యమైన విద్య నిరంతరాయంగా సరఫరా చేయాలని ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా విద్యుత్ అధికారులతో ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఏలూరు ఎంపీ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏలూరు పార్లమెంట్ పరిధిలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిష్కారానికి పలు సూచనలు, సలహాలు అందించి తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మహేష్ కుమార్ మాట్లాడుతూ రాజధాని అమరావతి సమీపంలో ఏలూరు కేంద్రంగా పరిశ్రమల జోన్ వస్తుందన్నారు. దానికి కావాల్సిన విద్యుత్ ప్రతిపాదనలు తయారు చేసి పంపాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలో విద్యుత్ అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ ఉండేలా చూడాలని అధికారులకు ఆదేశాలు జరిచేసారు.ఈ సమీక్షా సమావేశానికి ఎలక్ట్రికల్ ఎస్ఇ సాల్మన్ రాజు, ఇఇ రాధాకృష్ణ, డి ఇ నటరాజన్, పలువురు డివిజనల్ ఇంజనీర్లు హాజరయ్యారు.

## శ్రేష్టలో మెరిసిన పెదతాడేపల్లి గురుకుల విద్యార్థులు

**విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం రూరల్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పెదతాడేపల్లి గురుకుల పాఠశాలకు చెందిన 15 మంది విద్యార్థులు శ్రేష్ట ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి మొదటి విడత కౌన్సిలింగ్లో దేశంలోని వివిధ రాష్ట్రాల్లోని కార్పొరేట్ పాఠశాలలో సీట్లు సాధించారని ప్రిన్సిపల్ రాజారావు అన్నారు. శనివారం పాఠశాలలో సీట్లు సాధించిన విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజారావు మాట్లాడుతూ పాఠశాల నుండి ఈ పరీక్షలకు 139 మంది విద్యార్థులు హాజరు కాగా అందరూ ఉత్తీర్ణత సాధించారన్నారు. స్కీమ్ ఫర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఫర్ స్టూడెంట్స్ ఇన్ హైస్కూల్ టార్గెటెడ్ ఏరియాస్ (శ్రేష్ట) విజయం సాధించిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ ఉన్నత విద్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడే పాఠశాలల్లో విద్యార్థులకు ప్రవేశం కలుగుతుందన్నారు. విద్యతో పాటు ఉచిత వసతి, భోజనం అందిస్తారని తెలిపారు. కేరళ రాష్ట్రంలో 12 మంది విద్యార్థులు, ఆంధ్రప్రదేశ్లో ముగ్గురికి సీట్లు లభించాయని తెలిపారు. రెండవ కౌన్సిలింగ్లో మరింత ఎక్కువమందికి సీట్లు వచ్చే అవకాశం ఉందని అన్నారు. కార్పొరేట్ స్థాయిలో విద్యనందించే పాఠశాలలో సీట్లు లభించిన విద్యార్థులను తమ తల్లిదండ్రులు ప్రోత్సహించి ఆయా రాష్ట్రాల్లోని పాఠశాలలకు పంపిస్తే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. రానున్న కాలంలో దేశాభివృద్ధిలో భాగస్వామ్యులయ్యే పౌరులుగా నిలుస్తారని తెలిపారు. అనంతరం సీట్లు సాధించిన విద్యార్థులు ప్రిన్సిపాల్ రాజారావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రతాప్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నామినేటెడ్ పోస్టు ఇవ్వండి

**విశాలాంధ్ర -భీమవరం:** రాష్ట్ర ఎస్సి కార్పొరేషన్ సభ్యుడిగా కానీ, రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులుగా కాని తనను నియమించాలని టిడిపి జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే మంతెన రామరాజును భీమవరం మాజీ కౌన్సిలర్ యాళ్ళ వెంకటేశ్వరరావు వినతిపత్రాన్ని అందించి కోరారు. తమ పూర్వీకులు నుంచి తెలుగుదేశం పార్టీ విజయంలో పాత్ర వహిస్తున్నామని, తెలుగుదేశం పార్టీ క్రియాశీలక సభ్యునిగా ఉంటూ 2014 నుండి 2019 వరకు మున్సిపల్ కౌన్సిలర్‌గా పని చేసానని, ప్రస్తుతం పట్టణ ఎస్సి సెల్ అధ్యక్షునిగా పని చేస్తున్నానని, పార్టీ నిర్వహించిన ప్రతి కార్యక్రమంలో పాల్గొని తన వంతు పాత్ర వహిస్తున్నానని తెలిపారు.

## దాతల సహకారం వెలకట్టలేనిది

**విశాలాంధ్ర- కొయ్యలగూడెం :** దాతల సహకారం మరువలేనిదని కుంతల గూడెం గ్రామ పంచాయతీ సర్పంచ్ పులి నాగరత్నం పేర్కొన్నారు. ఎంపీపీ పాఠశాలలో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాయపూడి వెంకట రమణతో కలిసి పూర్వపు ఎస్.బి.ఐ మేనేజర్ కాత్రం వెంకటనాగేశ్వరరావు అందజేసిన రూ. 5వేలు విలువైన రాత పుస్తకాలను ఒకటో తరగతి నుండి 5వ తరగతి చదువుతున్న 45 మంది బాల బాలికలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానోపా ధ్యాయులు రాయపూడి పాఠశాల అభివృద్ధికి చేస్తున్న కృషిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు, బాలబాలికులు పాల్గొన్నారు.

## ఆగ్రో పరిశ్రమలు పెట్టండి, వడ్డీ రాయితీ పొందండి

**విశాలాంధ్ర-ఏలూరు:** రానున్న కాలంలో ఇథనాల్, బ్యాటరీ కార్లదే హవా అని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అన్నారు. శనివారం ఎంపీ కార్యాలయంలో జిల్లా రైస్ మిల్లర్ల తో జరిగిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ సేకరించిన ధాన్యానికి సకాలంలో రైతులకు సొమ్ము చెల్లించాలన్నారు.ఇథనాల్ పరిశ్రమలు నెలకొల్పాలని, ఇథనాల్ కలుపకుండా పెట్రోలు అమ్మటానికి వీలులేదన్నారు. పరిశ్రమలు స్థాపించటానికి ముందుకు వచ్చేవారికి 10శాతం పెట్టుబడితో 90శాతం బ్యాంకు రుణాలు మంజూరు చేయిస్తానన్నారు.50శాతం వడ్డీ రాయితీ ఇప్పిస్తానని ఆయన హామీ ఇచ్చారు. తీసుకొన్న రుణం 15 సంవత్సరాలలో తిరిగి చెల్లించవచ్చన్నారు. పెట్టుబడి మీద సబ్సిడీతో పాటు, తయారైన ఇథనాల్‌ను పూర్తి భరోసాతో కొనుగోలు చేస్తామన్నారు. ఒక కేపిడియల్ కు రూ.1ఒక కోటి పెట్టుబడి,100 కేపీడియల్ కు 10 ఎకరాల స్థలం, కావాలని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ వి ఎస్ ప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి పైడిపాటి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## తూడు, గుర్రపుడెక్క తొలగింపు

**విశాలాంధ్ర-నరసాపురం:** మండలంలోని రుస్తుంబాద, సీతారామ పురం గ్రామంలో శనివారం నాడు పంటపొలాలలోని డ్రెయిన్, కాలువలోని తూడు, గుర్రపుడెక్క తొలగింపు పనులకు నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయకర్ మాట్లాడుతూ పంటకాలువలను ప్రక్షాళనచేసి శివారు భూములకు కూడా సాగునీరు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు, కలవకొలను తాతాజీ, ఆకన చంద్రశేఖర్ , నియోజకవర్గ జనసేన టిడిపి బిజెపి నాయకులు జనసైనికులు వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ అడ్మిషన్లలో ఆన్‌లైన్ విధానం రద్దు

**విశాలాంధ్ర-మచిలీపట్నంటౌన్ :** డిగ్రీఅడ్మిషన్లలో ఆన్‌లైన్ విధానాన్ని రద్దు చేయాలని, అలాగే కృష్ణా యూనివర్సిటీలో వసతిగృహాన్ని నిర్మించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి మందగల సాయికుమార్ డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం కామ్రేడ్ మోదుమూడి శ్రీహరిరావు భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఆఫ్‌లైన్ అడ్మిషన్ విధానంతో ప్రభుత్వ, డిగ్రీ కళాశాలల విద్యార్థులతో కిటకిటలాడేవని, గత ప్రభుత్వం ఆన్‌లైన్ విద్యావిధానం తీసుకురావడంతో ఇంటర్ పూర్తయిన విద్యార్థులు తమకిష్టమైన కళాశాలలో చేరడానికి అవకాశం లేక చదువు మాని పనులకు వెళ్తున్న పరిస్థితి వచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై స్పందించి ఆన్‌లైన్ విధానం రద్దు చేయాలని, అలాగే ఇంజనీరింగ్ కళాశాలలకు ఫీజులు నిర్ధారించకపోవడంతో విద్యార్థులు అయోమయంలో ఉన్నారని, వెంటనే ఇంజనీరింగ్ కళాశాలలకు ఫీజులు నిర్ధారించాలి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకుల వసతి గృహాల సమస్యల పరిష్కారం కొరకు ఈనెల 20 నుండి 30వ తేదీ వరకు రాష్ట్రంలోని హాస్టళ్లను సందర్శించి విద్యార్థుల సమస్యలు తెలుసుకుని, ఆగస్టు 6వ తేదీన వాటి పరిష్కారం కొరకు ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ కృష్ణా జిల్లా కన్వీనర్ సాదిక్, ఏఐఎస్ఎఫ్ నాయకులు సన్నీ, తదితరులు పాల్గొన్నారు.

## నీట మునిగిన పొలాలు

**విశాలాంధ్ర-కూచిపూడి :** మొవ్వ మండలంలో శుక్రవారం రాత్రి నుంచి శనివా రం బజార్ వరకుకురుస్తున్ వర్షంతో వరి పొలాలు జలమయమయ్యాయి మధ్యాహ్నం నుంచి తెరిపిచ్చినా వాతావరణం మేఘావృతంగానే ఉంది. శుక్రవారంరాత్రితెల్లవార్లు కురిసిన వర్షం సుమారు ఒక సెంటీమీటర్ గా నమోదయింది. దీనితో పల్లపు ప్రాంతాలు జలమయమవటం కొన్ని ప్రాంతాలలోపొలాలు మునిగిపోయాయి. అలాగే వరి "వెద "పద్ధతిన సాగు చేసిన అయ్యంకి, మొవ్వ, నరసం పాలెం, భట్లపెనుమర్రు, పెదసనగల్లు, కాజ, అవురుపూడి, పాలంకిపాడు తదితర ప్రాంతాల్లోని పంట పొలాలలో సైతం నీరు నిలబడింది. ఈ ఏడాది కూడా ఖరీఫ్ సీజన్లో వర్షాల మూలంగా ప్రమాదాలు ఉన్నాయని, అటు ప్రభుత్వం కానీ, ఇటు అధికారులు కానీ పొలాల ముంపు సమస్య పరిష్కారం పై యుద్ధప్రాతిపదికన దృష్టి సారించకపోతే ఈ ఏడాది కూడా గత ఏడాది చేదు అనుభవాలే సరి చూడాల్సి వస్తుందని రైతులు కళ్ళనీలపర్యంతం అవుతున్నారు.

## ప్రివిలేజ్ కార్డులను ఆవిష్కరించిన కామినేని ఆసుపత్రి

**విశాలాంధ్ర - విజయవాడ :** వైద్య సేవల కోసం తమ ఆసుపత్రికి వచ్చే పేషెంట్లుకు స్పెషల్ ప్రివిలేజ్ కార్డులు అందించనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు . విజయవాడ పోరంకిలోని కామినేని ఆసుపత్రి ఈ కార్డు ద్వారా రోగులు తమ ఆసుపత్రి లోని వైద్య సేవల్లో పలు డిస్కౌంట్లు పొందవచ్చని వెల్లడించారు.ఈ మేరకు ప్రివిలేజ్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన బోడె ప్రసాద్ ను కామినేని ఆసుపత్రి యాజమాన్యం సన్మానించారు. ఈ సందర్భంగా కామినేని హాస్పిటల్స్ క్లస్టర్ హెడ్, పీ సునీల్ కుమార్ మాట్లాడుతూ "అందరికీ మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో కామినేని ఆసుపత్రి పనిచేస్తోందన్నారు. రోగులు డిస్కౌంట్ ధరలకే వైద్య సేవలను పొందే సౌకర్యం ఈ కార్డు కల్పిస్తుందన్నారు. ఈ సందర్భంగా పెనమలూరు ఎమ్మెల్యే, బోడె ప్రసాద్ మాట్లాడుతూ ఇంత గొప్ప వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లను నేను ప్రశంసిస్తున్నానన్నారు. ఈ ప్రివిలేజ్ కార్డ్ చొరవతో విజయవాడలోని ఎంతో మంది పేషెంట్లు లబ్ధి పొందుతారన్నారు. . కామినేని ఆసుపత్రి అందిస్తున్న ప్రివిలేజ్ కార్డు ద్వారా వైద్య సేవల్లో మెడిసిన్ కొనుగోలులో పలు డిస్కౌంట్లు పొందవచ్చన్నారు.

# బందరులో ఆయిల్ రిఫైనరీ!

**-సాల్ట్ భూములపై చూపు**

**-5 వేల ఎకరాలు అవసరమౌతాయని అంచనా**

**-పారిశ్రామిక పార్కుగా ఎన్‌ఒసి : ఎంపీ బాలశౌరి**

**విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం :** ఆయిల్ రిఫైనరీ ప్రాజెక్టు మచిలీపట్నం ప్రాంతంలో ఏర్పాటౌతుంది. సాల్ట్ భూములపై చూపు రూ.60 వేల కోట్లతో ఏర్పాటయ్యే ఈ రిఫైనరీ నిర్మాణం నాలుగు సంవత్సరాల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఎంపి బాలశౌరి చెప్పారు. దీనికి సుమారు ఐదు వేల ఎకరాల వరకు అవసరమవుతా యని అంచనా వేస్తున్నారు. ఇదే ప్రతిపాదనను బిపిసిఎల్ ప్రతినిధి బృందం సీఎం వద్ద ప్రస్తావించింది. అయితే ప్రయివేటు భూములు సేకరించడం ప్రభుత్వానికి ఆర్థిక భారంగా ఉంటుంది. దీనికి తోడు 2019కి ముందు బందరు పోర్టు నిర్మాణం, పరిశ్రమల అవసరాల పేరుతో పరిసర గ్రామాల్లోని 20 వేల ఎకరాల పూలింగ్, సేకరణకు పూనుకోవడం వివాదంగా మారింది. తర్వాత ఎన్నికల్లో దీని ప్రభావం పడింది. ఈ క్రమంలోనే తాజాగా ఈ ప్రాంతంలోని సాల్ట్ భూముల లభ్యతను పరిశీలిస్తున్నారు. తీరంలోని 8,708.29 సాల్ట్ భూములు ఉన్నాయి. కృత్తివెన్ను మండలం ఇంతేరు, పాంద్రాక పరిసర ప్రాంతాల్లో వెయ్యి ఎకరాలు ఉండగా, మిగిలిన భూములన్నీ బందరు తీర ప్రాంతంలోనే ఉన్నాయి. ఏడాదిన్నర క్రితం ఈ భూముల లీజు గడువు ముగిసింది. తిరిగి లీజు పునరుద్ధరించలేదు. బందరులోని పల్లెతుమ్మలపాలెంలో 6,600 ఎకరాల్లో భారత్ సాల్ట్ పరిశ్రమ ను ఏర్పాటు చేశారు. దీని లీజు పునరుద్ధరించలేదు. భారత్ సాల్ట్ కు కేటాయించి భూములకు ఎన్‌ఒసి తీసుకుని పరిశ్రమకు కేటాయించేందుకు పరిశీలిస్తున్నట్లు తెలుస్తుంది.

### ఈ ప్రాజెక్టు మచిలీపట్నం ప్రాంతంలోనే

విభజన హామీల్లో భాగంగా రాష్ట్రంలోని కోస్తా తీర ప్రాంతంలో ఆయిల్ రిఫైనరీ ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయి. దీనికి అవసరమైన వేల ఎకరాల భూములు అందుబాటులో ఉన్నాయని బందరు ఎంపి. బాలశౌరి గతంలో ప్రకటించారు. తాజాగా భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బిపిసిఎల్) అధికార బృందం ఈ రిఫైనరీ ఏర్పాటుపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో చర్చించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ ప్రాజెక్టుకు భూములు ఎక్కడ కేటాయిస్తారనేది ఆసక్తికరంగా మారింది.

## పంట కాలువల ప్రక్షాళన లేనట్టేనా ..?

**వ్యర్థాలు, మురుగుతో కూడిన నీరే తాగునీరా!**

**దివిసీమకు శుద్ధ జలం అందదా ?**

**మరో రెండు రోజులలో దిగువకు సాగు, తాగునీరు**

విశాలాంధ్ర అవనిగడ్డ : గడిచిన ప్రభుత్వంలో పంట, మురుగు కాలువల అభివృద్ధికి ఏ మాత్రం నాటి ప్రజా ప్రతినిధులు ఆశక్తి చూపలేదు. మరో రెండు రోజులలో దిగువకు సాగు, త్రాగు నీరు రానున్నట్లు అధికారులు సూచించారు. అధికారులు సూచనలు అయితే చేశారు కానీ పంట కాలువల అభివృద్ధి వైపు మాత్రం ఆశక్తి చూపడం లేదు. నూతన ప్రభుత్వం అయినా పంట కాలువల అభివృద్ధి జరుగుతుంది అంటే ఆ ఆశలు కూడా అడియాశాలుగానే మిగిలాయి. కృష్ణా బ్యారేజి నుండి దిగువకు సాగు, త్రాగు నీటిని బుధవారం ఇరిగేషన్ మంత్రి అధికారులతో కలిసి విడుదల చేశారు. అవనిగడ్డ దిగువన నాగాయలంక, కోడూరు మండలాలలోని ప్రజలకు పంట కాలువల ద్వారా వచ్చే నీరే త్రాగు నీరు. పంట కాలువలు ప్లాస్టిక్, పలు వ్యర్థాలతో నిండిపోయి ఉన్నప్పటికి ఏ ఊరి పంచాయితీ ఆధ్వర్యంలో ఆ గ్రామ పంట కాలువలను అభివృద్ధి చేసుకోవాల్సి ఉండగా జిల్లా స్థాయి అధికారులు సైతం పంచాయితీ అధికారులకు ఆదేశాలు జారీ చేయకపోవడంతో పంట కాలువలలో వ్యర్థాలు, ప్లాస్టిక్ కవర్లు తిష్ట వేశాయి. కాలువల ద్వారా నీరు వచ్చిన మొదటి రోజునే ఈ వ్యర్థాలన్నీ దిగువకు కొట్టుకుపోవడం దిగువన ప్లాస్టిక్ భూతం పెద్దగా ఏర్పడి ఆ ప్రాంత ప్రజలను భయభ్రాంతులకు సైతం గురి చేస్తుంది. ఈ ప్లాస్టిక్ భూతం ఒక రకంగా కాకుండా పలు రకాలుగా ప్రజలపై, మత్స్య పరిశ్రమపై దండయాత్ర చేస్తుంది. ప్లాస్టిక్ పాలిథిన్ కవర్ల వ్యర్థాల వల్ల ప్రతి సంవత్సరం సముద్రపు జీవరాశులు లక్షల సంఖ్యలో మృత్యువాత పడుతున్నాయి. ఈ పాలిథిన్ కవర్లు ఇదే విధంగా కొనసాగితే 2050 నాటికి నీరు కూడా దొరకని పరిస్థితులు ఏర్పడతాయి. ప్లాస్టిక్ వస్తువుల వాడకంతో చర్మ వ్యాధులు, హార్మోన్‌ల అసమతుల్యత, వినికిడి సమస్య, దృష్టి లోపాలు వంటివి ఏర్పాడతాయి. వీటితో పాటు పీల్చే గాలి, త్రాగే నీరు, తినే పదార్థం కూడా కలుషితం అవుతున్నాయి. ఈ ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల నీరు సరిగా పారక, మురుగు డ్రెయిన్‌లు సైతం పొంగి ప్రవహిస్తున్నాయి. ఈ పాలిథిన్ కవర్లు సముద్రంపై తెట్ట కట్టడం వల్ల జీవరాశులకు గాలి అందక చనిపోతున్నాయి. ప్లాస్టిక్ కవర్లు కాల్చడంతో దాని నుండి వెలువడే డయాక్సిన్ అనే విష పదార్థాలు గాలిలో కలుస్తాయి. ఈ గాలిని పీల్చడం వల్ల పలు రకాల జబ్బుల భారీన ప్రజలు పడుతున్నారు. అటువంటి వ్యర్థాలను పంట కాలువల్లో విసిరి వేయడం వల్ల ఆ వ్యర్థాలను తోచుకుంటూ సాగు, త్రాగు నీరు దిగువ ప్రాంతాలకు చేరడంతో దివిసీమ ప్రజలు పలు వ్యాధలు భారీన పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఆ దిశ గా పంట కాలువలను వ్యర్థాలు, ప్లాస్టిక్ కవర్లు లేని పంట కాలువలుగా అభివృద్ధి చేయాలని దివిసీమ ప్రజలు కోరుతున్నారు. ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ విచ్చలవిడిగా పారవేసే వారిపై పంచాయితీల ద్వారా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## మనుషులకు ప్రాణాంతకం కోనో కార్పస్

**విశాలాంధ్ర-అవనిగడ్డ :** కోనో కార్పస్ ( ఏడు ఆకుల చెట్టు )మొక్కలు అందంగా కనిపిస్తాయని, కంటికి ఇంపుగా ఉంటాయని అనుకున్నారు. విదేశాల్లో వీటిని చూసి మనస్సు కూడా పారేసుకున్నవారు కో కొల్లలు. చక్కగా దిగుమతి చేసుకుని ఈ మొక్కలను ఊరూరా నాటించారు. అవి ఎదుగుతున్న క్రమంలో వాటి అసలు నిజం తెలిసింది. ఆ అందమైన మొక్క వెనుక విషం దాగి ఉందని, మనిషి మనుగడకు అది ప్రాణాంతకం అని, ఈ చెట్టు మీద కనీసం పక్షి కూడా వాలదని అనేక వ్యాధులకు అది కారకం అవుతుందని నిపుణులు కూడా హెచ్చరించారు. అప్పటికే ఈ మొక్క ఊరూరా విస్తరించింది. దీంతో అధికారులు వాటిని తొలగించే పనిలో పడిపోయారు. కానీ ఆ కార్యక్రమం మాత్రం ఎక్కడా సజావుగా సాగలేదు. ఇప్పటికైనా తొందర పడకపోతే ప్రమాదమే. శంఖుపు రూపంలో పెరుగుతుంది కాబట్టి దీనికి కోనో కార్పస్ అని పేరు వచ్చింది. పర్యావరణ రక్షణలో వాతావరణాన్ని సమతుల్యంగా ఉంచడంతో వృక్షాలు ముఖ్య పాత్ర పోషిస్తాయి. అందుకే వృక్షాలను మనం కాపాడితే అవి తిరిగి మనకు ఆక్సిజన్ అందచేసి కాపాడతాయని అంటారు. ఇదే తరుణంలో తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ఏటా హరితహారం కార్యక్రమాన్ని చేపట్టడం పెద్ద ఎత్తున మొక్కలు నాటించడం. ఇలా ఎదుగుతున్న వాటిలో పక్షులు వాలని చెట్లు కూడా ఉన్నాయంటే నమ్మ గలమా ? నమ్మి తీరాల్సిందే అని అంటున్నారు నిపుణులు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలలో ఎక్కువ శాతం కోనో కార్పస్ జాతికి చెందినవే పట్టణాల నుండి పల్లెల వరకు రోడ్డుకు ఇరువైపులా నాటారు. తక్కువ కాలంలో ఎక్కువ ఎత్తు పెరుగుతాయని ఆశించిన ప్రజలకు ఆ ఆశ కొద్ది రోజులకే నిరాశ మిగిల్చింది. గతంలోనే విశాఖపట్నం వంటి ప్రాంతాల్లో ఈ మొక్కలు హానీకరం అని తలచి తొలగించినప్పటికి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి నూతనంగా ఈ మొక్కల వల్ల భూగర్భ జలాలు అడుగంటుతాయని చెప్పడంతో మరళా ప్రజలు ఆ మొక్కలను తొలగించేందుకు సమాయత్తం అవుతున్నారు.

# జెడ్పీ పాఠశాలల్లో విద్యార్థుల అవస్థలు

**విశాలాంధ్ర బ్యూరో- మచిలీపట్నం :** అన్ని పాఠశాలలను ఆధునీకరిస్తామని చెబుతూ నాడు నేడు పథకంలో భాగంగా వైకాపా ప్రభుత్వం అనేక పాఠశాలల్లో చేపట్టిన పనులను అసంపూర్తిగా వదిలేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పాఠశాలల్లో చేపట్టిన అదనపు తరగతి భవనాలు అందుబాటులోకి రాకపోవడంతో విద్యార్థులు ఉన్న గదుల్లోనే కిక్కిరిసి కూర్చోవలసిన పరిస్థితి ఏర్పడింది. పనులు పూర్తి చేయడానికి అవసరమైన నిధుల కోసం గత ఏడాది ప్రతి పాదనలు పంపినా పట్టించుకోకుండా వదిలేయడంతో విద్యార్థులు సమస్యల మధ్య చదువుకోవలసిన దుస్థితి దాపురించింది.

### నాడు-నేడును నట్టేట ముంచేసారు

మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలోని పలు పాఠశాలల్లో విద్యార్థులు కనీసం కూర్చునేందుకు సరైన భవనాలు లేక అవస్థలు పడుతున్నారు. చిలకలపూడి మున్సిపల్ పాండురంగ ఉన్నత పాఠశాలలో 800 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. సరిపడా భవనాలు లేక విద్యార్థులకు ఉన్న గదుల్లోనే ఇరుక్కుని కూర్చోవాల్సిన పరిస్థితి. సమగ్రశిక్షా ద్వారా భవన నిర్మణాలకు రూ. 36 లక్షలు కేటాయించగా దాతలు రూ.కోటికి పైగా ఇచ్చేందుకు ముందుకు రావడంతో పనులు ప్రారంభించారు. భవనం నిర్మించే ప్రదేశంపై కొందరు కోర్టుకు వెళ్లడంతో పనులు పునాదుల్లోనే ఆగిపోయాయి. కేటాయించిన నిధులు ఇతర పాఠశాలలకు మళ్లించేయడంపై విమర్శలు వచ్చాయి. అలాగే దేశాయిపేట హైస్కూల్లో 700 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ భవన నిర్మాణ పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు. సరిపడా తరగతి గదులు లేక ఉన్న వాటిల్లోనే విద్యార్థులు కిక్కిరిసి కూర్చుంటున్నారు. ఇక్కడ నిర్మిస్తున్న అదనపు తరగతి భవనం అసంపూర్తిగా ఉంది. అలాగే రైలుపేట ప్రాథమిక ఉన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా వర్గోన్నతి కల్పించారు. ఇక్కడ ప్రస్తుతం ఒకటి నంచి తొమ్మిది తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు సరిపడా గదులు లేక ఓ భవన నిర్మాణం ప్రారంభించినా అది పూర్తికాకుండానే ఆగిపోయింది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. రుస్తుంబాద బాలికల పాఠశాలలో కూడా భవన నిర్మాణం అసంపూర్తిగా ఆగిపోయింది. ఇలా నగరంలోని అనేక పాఠశాలల్లో అదనపు తరగతి భవనాలే కాదు ఇతర పనులు కూడా ఎక్కడివక్కడే ఆగిపోయాయి. బందరు, పెడన,గూడూరు, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని అనేక పాఠశాలల్లో ఇదే పరిస్థితి దాపురించింది. బందరు మండలం తపశిపూడి, ఎస్ ఎన్ గొల్లపాలెంతో పాటు తదితర ప్రాంతాల్లో ని పాఠశాలల్లో చేపట్టిన పనులు కూడా అసంపూర్తిగా ఆగిపోయాయి. గూడూరు మండలంలో 17 పాఠశాలలను ఎంపిక చేసి పనులు చేపట్టారు. పలు పాఠశాలల్లో అదనపు తరగతి భవనాలు కూడా ఉన్నాయి. గూడూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి భవనం చివరి దశలో ఆగిపోయింది. అర్తీపల్లి పాఠశాలలో చేపట్టిన భవనం అలాగే ఉంది. కంకటావ జడ్పీ ఉన్నత పాఠశాలలో చేపట్టిన వివిధ పనులు పూర్తి కాలేదు. రాయవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది.

రోగులకు మెరుగైన వైద్యం అందించడంలో కామినేని ఆసుపత్రి